



## కాఫీ కార్మికుల నోటీసు

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 19న సోమవారం నుండి సమ్మె చేస్తామని పాడేరు ఏపీఎఫ్‌డీసి డివిజనల్ మేనేజర్ కు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో కాఫీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు మాట్లాడుతూ, గత నెల 18న కలెక్టర్ గెజిట్‌లో అన్ని డివిజన్ స్థాయి అధికారులు, రీజనల్ మేనేజర్‌లకు వినతులు అందించడం జరిగిందని తెలిపారు. నేటికి కాఫీపండ్ల సేకరణ రేటు, రోజువారి కూలి రేట్లు ఏపీఎఫ్‌డిసి యాజమాన్యం పెంచలేదన్నారు. వివిధ స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బంది నియామకాలు చేపట్టాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే కాఫీ కార్మికుల వేతన సమస్య పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో 19న సోమవారం నుండి కాఫీ కార్మికులు పళ్ళ సేకరణ ఆపివేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాలికి లక్కు, చిట్టిబాబు, సత్యనారాయణ, బొజ్జన్న, కార్మికులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం

# గిరిజన చట్టాలు, హక్కుల్ని కాలరాస్తే సహించం

ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి-పాడేరు: రాజకీయ లబ్ధి కోసం గిరిజనుల హక్కులను చట్టాలను కాలరాస్తే సహించబోమని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర హెచ్చరించారు. పాడేరులో ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో అటవీ వనరులను కార్పొరేట్ కంపెనీ లకు అప్పగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని తెలిపారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి తన వ్యక్తిగత రాజకీయ అవసరాల కోసం ప్రధాని మోడీ మిత్రులైన అదానీ, శ్రీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ కు హైడ్రో పవర్ ప్రాజెక్టును అప్పగించాలని క్యాబినెట్ సమావేశంలో ఆమోదించడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం 1/70 చట్టానికి, సుప్రీం కోర్టు తీర్పు కి విరుద్ధంగా ఉందని అన్నారు. కేంద్ర అటవీ సంరక్షణ చట్ట సవరణకు కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాలలో సవరణ బిల్లు ప్రవేశ పెట్టాలని అఖిల పక్ష సమావేశంలో ఎజెండా పెట్టిందని, చట్ట సవరణలు అనంతరం అటవీ ప్రాంతంలో మైనింగ్, పవర్ ప్రాజెక్టు లను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రక్రియ సులభతరం కానుందని తెలిపారు. గిరిజన గ్రామ సభ ఆమోదం, గిరిజన సలహా మండలి (టి.ఏ.సి) తీర్మానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అప్పగించడం సరైంది కాదన్నారు. గిరిజనుల అభిప్రాయానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ వైఖరిని గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కోసం క్యాబినెట్లో ఏనాడూ చర్చ పెట్టకుండా గిరిజన ప్రాంతాన్ని సర్వనాశనం చేయాలని చూడటం అన్యాయమన్నారు. విద్యా సంస్థల్లో విద్యార్థి, గిరిజన ప్రజా సంఘాలు ప్రవేశం నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి నవరత్నాలకు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాలికి లక్కు, కొమ్మ పృధ్వి, జిల్లా కమిటీ సభ్యులు బోనంగి రామన్న, మట్టముక్క శ్రీను, జీనబంధు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్ర



మాట్లాడుతున్న చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

# యువ క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యం

### చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి -సీలేరు

అంతర్జాతీయ, జాతీయ క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహించే విధంగా యువ క్రీడాకారులను తీర్చిదిద్దడమే యువహో కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన మాదిగమల్లులో ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు చెప్పారు. మారుమూల ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి, బాహ్య ప్రపంచానికి తెలియడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. యువతకు క్రీడల ద్వారా మనోధైర్యాన్ని కల్పించవచ్చని తెలిపారు. ఎటువంటి సెల్ సిగ్నల్స్ లేని, అత్యంత సమస్యాత్మకమైన మూరుమూల ప్రాంతాల్లో జీకే వీధి సిఐ అశోక్ కుమార్, ఎస్సైలు రామకృష్ణ, అప్పల సూరి, రంజిత్ పర్యటించి యువతను చైతన్యవంతులు చేసి 86 జట్లు క్రీడా పోటీలో పాల్గొనేలా చేయడం అభినందనీయమన్నారు. మండల స్థాయి అసోసియేషన్లు ఏర్పాటు చేసి మంచి పోషకాహారం అందించి, నైపుణ్యంతో కూడిన శిక్షణ వీరికి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఆర్థిక సహాయానికి ఎంపికైన క్రీడాకారులకు అసోసియేషన్ ద్వారా రూ.10 లక్షలు వరకు కార్పస్ ఫండ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**ఎంతో దోహదపడిన మెగా వైద్య శిబిరం**

గిరిగ్రామాల్లో ఏర్పాటు చేసిన సంజీవిని మెగా వైద్య శిబిరం నిరుపేద గిరిజనులకు ఎంత దోహదపడిందని ఎఎస్‌పి తెలిపారు. తోకరాయి గ్రామానికి చెందిన పుణ్యవతి అనే మహిళ నడవలేని స్థితిలో ఉండగా, మెగా వైద్య శిబిరానికి తీసుకొచ్చి అన్ని పరీక్షలు నిర్వహించి, మెరుగైన సేవలు నిమిత్తం మైదాన ప్రాంతానికి రిఫరల్ చేసినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

### ఉమ్మడి జిల్లాల జెడ్పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఉమ్మడి జిల్లాల జెడ్పి చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి, ఐసిడిఎస్, విద్యా, రెవిన్యూ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, విద్యా, ఐసిడిఎస్ శాఖలకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తిన వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఆమె సూచించారు. అనంతరం సుభద్ర మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్తుందని, వీటిని అమలు పరచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చిత్తశుద్ధితో పని చేస్తే అధికారులకు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కిరణ్ కుమార్, ఎంఈవో చెల్లయ్య, తహశీల్దార్ నర్సమ్మ, ఐసిడిఎస్ సిడిపివో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్లు ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులతో సుభద్ర సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల అభివృద్ధికి తయారు చేయాల్సిన ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ, పేదల సంక్షేమానికి పాటుపడాలని తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయానికీ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నారని, అవి గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కిరణ్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభ్యున్నతే లక్ష్యం

### ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశగా పల్లెలను ప్రగతి పథంలో నడిపించే లక్ష్యంతో ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగుతుందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కొనియాడారు. జీకే వీధి మండలం భూసుమాను వీధి, చెరుకుమల్లి కిల్లోగూడ వీధి, బొరుకులగొంది, అన్నవరం, మదిమల్లు, చోడరాయ్ గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గ్రామాల పురోభివృద్ధి విషయంలో ప్రభుత్వం తీసుకోవలసిన నిర్ణయాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం అదనంగా నిధులు కేటాయించేందుకు సిఎం సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రతి పేదవాడూ ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఈరోజు పారదర్శకమైన పాలన ప్రజలు చూడగలుగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొర్రా కమల, వైస్ సర్పంచ్ జోరంగి వెంకటరమణ, ఎంపీటీసీ గాదెల జ్ఞాన దీపిక, ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు సిహెచ్ ఆనంద్, దేముడు, ఎంపిటిసి పి.నాగమణి, ఎం.రమణ, సర్పంచ్ ఎం.రాజు, వార్డు మెంబర్లు శ్రీ పార్వతమ్మ, కే.సత్తిబాబు, కే.సుబ్బారావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే బొంజు బాబు, జె చిట్టిబాబు, కే.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సొలభంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పీహెచ్సీ పరిధి సొలభంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం పాడేరు అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లీలాప్రసాద్ సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో రోగులకు సరైన వైద్యం అందేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వంతాల గ్రామ సచివాలయం పరిధి వేలంగరువులో సందర్శించారు. అనంతరం పలు పిహెచ్సిలను సందర్శించి రోగులతో మాట్లాడుతూ వైద్యం కోసం ఆరా తీశారు. ఆయన వెంట వైద్యులు విగ్నేష్, రవి చంద్ర శేఖర్, పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి ఉన్నారు.

## చందాలతో బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో సాయిబాబా గుడి వద్ద మంచినీరు బోరు గత కొంత కాలంగా మరమ్మతుకు నోచు కోలేదు. దీన్ని ఉపయోగంలోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించిన పాపాన పోలేదు. దీంతో చందాలు వేసుకుని బోరు మరమ్మత్తు చేసుకోవడానికి పునుకొన్నారు. ఇంటింటా కొళాయిల పేరుతో కోట్లు రూపాయిలు ఖర్చు చేసిన అధికారులు, గుత్తేదార్లు జేబులు నింపుకొన్నారే తప్పా, వారం రోజుల పాటైనా మంచి నీళ్ళు సరఫరా చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, నీలమ్మ, బుజ్జి, ఇందిర, లక్ష్మి, కనక, రమణమ్మ, ఆనంద్, గిరిజన సంఘం నాయకులు కృష్ణారావు పాల్గొన్నారు.

## గాయపడిన విద్యార్థి మృతి

ప్రజాశక్తి -పాడేరు:- ఈనెల 6న కొట్లాటలో గాయపడి చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థి జర్త కొండబాబు గురువారం మధ్యాహ్నం విశాఖపట్నం కెజిహెచ్ లో మృతి చెందాడు. జి.మాడుగుల మండలంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి పాఠశాలలోని కొట్లాటలో తీవ్రంగా గాయపడిన సంగతి విధితమే. కొండ బాబుకు గుండెల పైన ఊపిరితిత్తుల్లో బలమైన దెబ్బలు తగిలి నట్లు తెలుస్తోంది కేజీహెచ్ కు బుధవారం రాత్రి తీసుకువెళ్లారు వైద్యం అందించిన కోలుకోలేకపోయినా కొండబాబు మధ్యాహ్నం మృతి చెందాడు.



సీతమ్మ స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కిరణ్, సిపిఎం కార్యకర్తలు

# పాయం సీతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎర్ర జెండా చేతబట్టి, దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా, గిరిజన, మహిళల సమస్యలపై పోరాటాలు నడిపిన అమరజీవి కీర్తిశేషులు పాయం సీతమ్మ 13వ వర్థంతి కార్యక్రమం గురువారం కూనవరం మండలం పెద్దార్కూరులో ఘనంగా నిర్వహించారు. సీతమ్మ స్థూపానానికి, ఆమె చిత్ర పటానికి సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పేన్ కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ముర్లపాటి నాగేశ్వరరావు, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీతమ్మ నాడు ఎర్రజెండా నీడన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. స్త్రీల సమస్యలపై అనేక పోరాటారని గుర్తు చేశారు. ఆమె పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, మాజీ జెడ్పిటిసి రంగమ్మ నాయకులు పాయం సత్యనారాయణ, తాలూరి శ్రీనివాసరావు, తెలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచులు నాగమణి, వెంకమ్మ, శంకర్, రామారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహశీల్దార్ ఆత్మహత్యపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: పెదబయలు మండల తహసీల్దార్ శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమైన విషయమని, ఆయన మరణానికి ప్రభుత్వం, ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ బాధ్యత వహించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ముఖి శేషాద్రి, ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం డిమాండ్ చేశారు. ప్రాజెక్టు అధికారి పరుష పదజాలంతో దుర్భాషలాడటం, అవమానించడంతోనే మానసిక క్షోభ కు గురై ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. గతంలో అనేక మార్లు ఎంతోమంది ఉద్యోగులను వ్యక్తిగతంగా పరుష పదజాలం తో దూషించి, అవమానించారని ఇది తగదన్నారు. గతంలో సిఆర్‌టి ఉపాధ్యాయులను, ఉద్యోగినులను, వివిధ ఉద్యోగ సంఘ నాయకులను అవమానించారని తెలిపారు. ప్రాజెక్టు అధికారి తన మాట తీరు, పద్ధతి మార్చుకోవాలని, లేని పక్షంలో ఉద్యోగుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తహసీల్దార్ మరణానికి భాధ్యులను చేస్తూ ఉప తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. వెంటనే సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-హుకుంపేట: ఏసుక్రీస్తు లోకానికి రావడమే నిజమైన క్రిస్మస్ అని పాస్టర్ కె.నెహెమ్యా అన్నారు మండల కేంద్రంలో క్రీస్తు ప్రేమ సువార్తిక సహవాసము చర్చ్ వ్యవస్థాపకులు పాస్టర్ కె.నెహెమ్యా ఆధ్వర్యంలో సిఎల్ఈఎఫ్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైజాగ్ క్రైస్ట్ చర్చ్ రెవరెండ్ సిహెచ్ భాస్కర్, పాస్టర్ సువర్ణరాజ్, పాస్టర్ ఆదాము పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లా డుతూ క్రీస్తు ప్రేమను పంచడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. ఈ కార్యక్రమం లో సంఘ పెద్దలు తాటికొండ పౌలు, ఎమ్. భాస్కర్ రావు, ఐ.జోసెఫ్ రాజు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

## 17న గ్రాండ్ క్రిస్మస్‌పై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రతి ఏటా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించే గ్రాండ్ క్రిస్మస్ వేడుక పోస్టర్‌ను కారుణ్య మినిస్ట్రీస్ ఫౌండర్ బిషప్ చిక్కాల దైవకృప ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కుమ్మరిపుట్టులోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించిన ఆమె మాట్లాడుతూ, ఈనెల 17న పట్టణంలోని సిబిఎం చర్చి ఆవరణలో జరిగే గ్రాండ్ క్రిస్మస్ వేడుకకు పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొనాలని కోరారు. వాక్యోపదేశకులుగా సిబిఎం ఫీల్డ్ డైరెక్టర్ వెయిన్ ఎ జోసెఫ్, అంతర్జాతీయ సువార్త గాయకులు నిస్సి జాన్ పాల్గొంటారని పేర్కొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

# డొంకరాయి పవర్ కెనాల్‌కు భారీ గండి

## నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధి, డొంకరాయి పవర్ కెనాల్‌కు గురువారం తెల్లవారుజామున భారీగా గండి పడింది. దీంతో డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో భారీ గండిపడి వృధాగా నీరు ఏరులై పారింది. డొంగరాయి ఏవీపీ డ్యాం వరద విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు పవర్ కెనాల్ గండి పడినట్లు గుర్తించి జెన్కో అధికారులు సమాచారం అందించారు. హటా హుటిన అధికారులు పవర్ కెనాల్ వద్ద చేరుకొని కెనాల్ నుంచి నీరు వృధాగా పోకుండా చర్యలు చేపట్టారు. ఈ సమయంలో డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. సుమారు 16 మీటర్ల వరకు కెనాల్‌కు గండి పడినట్లు తెలిసింది. 2019లో పవర్ కెనాల్‌కు గండి పడింది అప్పట్లో సుమారు మూడు కోట్లు రూపాయలు ఖర్చుతో గండి పూర్చారు. తాజాగా మళ్లీ కెనాల్‌కు గండి పడడంతో ఏపీ జెన్కోకు భారీ నష్టం నష్టం వాటిల్లితోంది.

**గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు**

డొంకరాయి పవర్ కెనాల్‌కు గండిపడిన సమాచారాన్ని జెన్కో ఉన్నతాధికారులకు మోతుగూడెం ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజనీర్ కెవి నాగేశ్వరరావు అందించారు. దీంతో ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ, సీఈ (సివిల్) ఎస్ శేషారెడ్డితో కూడిన బృందం గురువారం సాయంత్రం గండిపడిన ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. గండిపడిన తీరును హైడల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. గండి పడిన ప్రదేశం నుంచి నీరు వృధాగా పోకుండా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ( సివిల్ ) కెకెవి.ప్రశాంత్ కుమార్, ఇన్‌ఛార్జి ఓ అండ్ డామ్ ఎస్ఇ బాలకృష్ణ, జాకీర్ హుస్సేన్ బాబురావుతో సమావేశమయ్యారు. పవర్ కెనాల్ గండి పడిన ప్రాంతాన్ని పునర్నిర్మాణం చేయడానికి ఎంత ఖర్చు అవుతుంది, విధి విధానాలతో కూడిన తుది నివేదికను హైడల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణతో కూడిన బందం జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ బి.శ్రీధర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఎఇ కృష్ణారావు, సెక్యూరిటీ అధికారి రామకృష్ణ, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.



కెనాల్‌కు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెన్‌కో ఉన్నతాధికారులు

### ప్రభుత్వ , దేవస్థానం భూములను

# పోలవరం నిర్వాసితుల ఇళ్ల స్థలాలకు కేటాయించాలి

**తహశీల్దారుకు ఏపి గిరిజన సంఘం వినతి**

ప్రజాశక్తి - ఎటపాక

మండలంలోని పురుషోత్తపట్నంలోని దేవస్థానం భూములను, ఎటపాకలోని ప్రభుత్వ భూములను పోలవరం నిర్వాసితులకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు గురువారం తహశీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుషోత్తపట్నంలోని సర్వేనెంబర్ 9, 71, 72లో గల 6.30 ఎకరాల దేవస్థానం భూములు, ఎటపాకలోని ప్రభుత్వ భూములు ఉన్నాయని తెలిపారు. 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ ఇక్కడ భూములను గిరిజనేతరులు అనుభవిస్తున్నారని, ఆ స్థలాల్లో గిరిజనులు పాకలు వేసుకుంటే మాత్రం నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనేతరులు భూములు అనుభవిస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోని అధికారులు, పాకలు వేసుకున్న గిరిజనులను ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం ఏమాత్రం సరికాదని పేర్కొన్నారు. గిరిజనేతరులు కట్టిన అక్రమ కట్టడాలను కూల్చివేసి, ఆ భూమిని చేసుకొని పోలవరం నిర్వాసితుల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కాకా అర్జున్ దొర, ఇరపా అజయ్ కుమార్, నాయకులు ఇరపా సత్యం, బుద్దుల భద్రయ్య, సవలం రాము, నక్కా సూరిబాబు, సీసం కొండ, ప్రవీణ్ ఉన్నారు.



తహశీల్దారు వేణుగోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నాయకులు

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి- చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన మహాపురుషుడు అని కొనియాడారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే అశయాల కొరకు జీవితాంతం కృషి చేశారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మద్రాసులో గురవయ్య మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారని చెప్పారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అప్పనమ్మ, హారతి, శకుంతల, డాక్టర్ వై పద్మ, రాజబాబు, శ్రీదేవి, శ్రీలక్ష్మి, ఇమానుయేలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రత్న మాణిక్యం

## వైసిపి కార్యకర్తకు ఎంపీ భర్త పరామర్శ

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని మూలపేట పంచాయతీ, మర్రిపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త పోలోజి వెంకటరమణ గత వారం రోజుల నుంచి అనారోగ్యంతో నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, విషయం తెలుసుకున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి భర్త, నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ గురువారం వెంకటరమణను పరామర్శించారు. ఆయనకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేను సైతం ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు సురేష్ పట్నాయక్, పృధ్వీరాజ్, సాయి, మహేష్ పడాల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణను పరామర్శిస్తున్న శివప్రసాద్



మాట్లాడుతున్న గంగారావు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణలో....

# మోడీతో జగన్ కలిసిపోయారా?

## 4వేల ఎకరాల భూమి ప్రతిపాదనపై వివరణ ఇవ్వాలి

## సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగారావు

**ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ యొక్క 4 వేల ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి కావాలని ఇటీవల స్టీల్ మంత్రిత్వశాఖ నిర్వహించిన డ్యాష్ బోర్డు సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు వార్తలొస్తున్నాయని, దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 4 వేల ఎకరాలు భూమి ప్రతిపాదించటంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కేంద్ర స్టీల్ మంత్రి నిర్వహించే డాష్‌బోర్డు సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎందుకు హాజరతున్నారో ప్రభుత్వం తెలియజేయాలని కోరారు. ఇప్పటికే కేంద్రంలోని బిజెపి సర్కారు టాటా స్టీల్, జెఎస్‌డబ్ల్యు, అదానీ, పోస్కో గ్రూపులతో ప్రీ-బిడ్డింగ్ సంప్రదింపులు నిర్వహించినట్లు, కంపెనీ వాల్యుయేషన్‌ను కూడా రహస్యంగా పూర్తిచేయడానికి కుట్రపన్నిందని వార్తలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆమోదంతోనే నరేంద్రమోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ 100శాతం వాటాలను అమ్మటానికి చక చకా పావులు కదుపుతున్నట్లు ఈ వార్తలు రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు ఒక వైపు స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకమంటూనే రెండోవైపు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మిలాఖత్ అయి ప్లాంట్ అమ్మకానికి అంగీకరించటం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోడీని విశాఖకు రప్పించి కూడా స్టీల్ ప్లాంట్ అమ్మకంపై ప్రకటన చేయించలేకపోయారని విమర్శించారు. వారం రోజుల క్రితం దీపం సెక్రటరీ ప్లాంట్‌ను అమ్మి తీరుతామని ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. రెండోవైపు ఉక్కు ఉద్యమంలో చీలికలు తీసుకురావడానికి బిజెపి ఎంపీ జివిఎల్ నర్సింహరావును విశాఖకు ప్రత్యేకంగా నరేంద్రమోడీ పంపించారని తెలిపారు. ప్లాంట్‌ను వేగంగా అమ్మటానికి, ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవటానికి ఉక్కు ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఉక్కు మంత్రిని కలిసి మెమోరాండాలు ఇవ్వడం, పార్లమెంటులో ప్రశ్నలు లేవనెత్తడం తదితరాలన్నీ స్టీల్ ప్లాంట్ అమ్మకంకోసమే ఒక కుట్రతో చేస్తున్నారని విమర్శించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్లాంట్‌ను తీవ్ర నష్టాలు పాల్జేయడానికి కేంద్ర బిజెపి సర్కార్ స్టీల్ ఉత్పత్తిని 50శాతం తగ్గించేసిందని, బ్లాస్ట్‌ఫర్నేస్‌ను మూసివేసిందని, బొగ్గు సరఫరాకు ఆటంకాలు కల్పించిందని తెలిపారు. ఈ ఏడాది ప్లాంట్‌కు రూ.3వేల కోట్ల పైబడి నష్టాలు తీసుకురావాలని బిజెపి కుట్రతో వ్యవహరిస్తోందని విమర్శించారు. నష్టాలు తీసుకొచ్చి విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రజల్లో వ్యతిరేకత సృష్టించి అమ్మేయాలనే వ్యూహాత్మక కుట్ర ఇందులో దాగి ఉందన్నారు. ఇంత దారుణం జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించటం లేదంటే ఇవన్నీ ఆయన ఆమోదంతోనే జరుగుతున్నాయని అర్థం చేసుకోవచ్చన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీపం సమావేశాలకు హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తక్షణం అన్ని రాజకీయపక్షాలను సమావేశపర్చాలని, ప్రధానమంత్రిని అఖిలపక్ష పార్టీలతో కలవాలని కోరారు. ప్లాంట్‌ను విక్రయించే చర్యలను ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కాలుష్యంపై ఖర్చుకు లెక్కాపత్రం ఎక్కడ?



## 2021-22లోనే రూ.100.75కోట్లు విడుదల

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

గాలిలో నాణ్యత విశాఖ నగరంలో ఎప్పుడూ ప్రశ్నార్థకంగానే తయారవుతోంది. నిధులకు మాత్రం కొదవు లేదంటూ పాలకుల ప్రకటనలు సరేసరి.. నగరంపై దుమ్ము, ధూళి దాడితో ప్రజల్లో ఊపిరితిత్తుల సమస్యలు వంటివి పెరుగుతున్నాయంటూ సంబంధిత వైద్యులు మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేడు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్లీన్ ఎయిర్ క్వాలిటీ ప్రోగ్రాం కింద విశాఖకు రూ.2021-22 వరకూ రూ.100.75కోట్లు విడుదల చేసినట్లు గురువారం పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి అశ్వినికుమార్ వెల్లడించారు. 2023 ఆర్థిక సంవత్సరం వరకూ విశాఖకు రూ.148 కోట్లు అనుమతులు చేసినట్లు ప్రకటించారు. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) గత కౌన్సిల్ సమావేశంలో రూ.28కోట్లకుపైగా కాలుష్యంపై ఖర్చుచేసేందుకు ఆమోదం తెలిపింది.

**పడిపోతున్న గాలిలో నాణ్యత....**

నవంబర్, డిసెంబర్‌లో ఎయిర్ క్వాలిటీ అత్యంత వరస్ట్‌గా ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. 274 మార్క్‌కు చేరింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రకారం 200 ఉంటేనే అత్యంత హీనంగా ఉన్నట్టు లెక్క. ఏయూ అధ్యాపకులు చెబుతున్న ప్రకారం చలికాలంలో గాలిలో కాలుష్య ఉద్గారాలు సులువుగా మనుషుల శరీరాల్లోకి చొచ్చుకుని పోతాయని దీనివల్ల ఊపిరితిత్తులు, ఇతర గుండె సంబంధిత సమస్యలు పెరుగుతాయని వెల్లడిచేస్తున్నారు. ఎయిర్ పొల్యూషన్‌ను రెగ్యులేట్ చేసేందుకు యాక్షన్ ప్లాన్ విశాఖలో సరైన పద్ధతిలో అమలు కావడం లేదన్నది స్పష్టమవుతోంది. జివిఎంసి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జిల్లా పరిశ్రమల కేంద్రం, రవాణా శాఖ, పోలీస్, గనుల శాఖ కాలుష్య నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నాయో మోనటరింగ్, సమీక్షలను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పై అధికారుల కమిటీ సమీక్ష చేయాల్సి ఉన్నా జరగడం లేదు. కాలుష్య నియంత్రణ బోర్డు జోనల్ కార్యాలయ అధికారుల్లో కాలుష్య నివారణ విషయమై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిధుల లెక్కపై మీనమేషాలు లెక్కిస్తున్నారు.

### చలికాలంలో కాలుష్యం పెరుగుతుంది

చలికాలంలో కొద్దిరోజులు కాలుష్యం అధికంగా ఉండడం సహజమే. ఎందుకంటే గాలి బయటకు పోవడానికి అవకాశం లేదు. నిధులు ఆయా శాఖలకే వస్తాయి. జివిఎంసి ట్రాఫిక్ కూడళ్లలో నియంత్రణ చేసే పనిచేయాలి. అమలు చేసే పని జివిఎంసిదే. పరిశ్రమల్లో ఎయిర్ క్వాలిటీ మానటరింగ్ ఉంది. గడిచిన సంవత్సరంలో ఏయే శాఖలు ఎంతవరకు రూ.100కోట్లలో ఖర్చుచేశాయో నాకు నివేదిక రాలేదు. నిధులు వచ్చినమాట నిజమే కానీ ఏ శాఖకు ఎంత వచ్చిందో సమాచారం లేదు. పిసిబికి మాత్రం నిధులు చాలా తక్కువ వచ్చాయి. విజయవాడకు అధికంగా వచ్చాయి.

**రాజేంద్రరెడ్డి**
**కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కమిషనర్**

# స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను జగన్ అడ్డుకోవాలి

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అడ్డుకోవాలని సిఐటియు పెందుర్తి జోన్ కార్యదర్శి జి.శంకరరావు డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 623వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు పెందుర్తి జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ మిగిలు భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా జగన్మోహన్‌రెడ్డిపైనే ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైన స్టీల్ ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీల్ కర్మాగారం, మరింత లాభాల్లో నడవడానికి సొంత గనులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.అప్పారావు, కె.ముత్యాలు, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.




దీక్షలో కూర్చున్న సిఐటియు పెందుర్తి జోన్ నాయకులు

## నేటి నుంచి ఐఎస్ఎఎంఇ ఫోరం సమావేశాలు

**ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ యొక్క 50 ఐఎస్ఎఎంఇ ఫోరం 2022 సమావేశాలు లయన్స్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ 316 ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్ నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బ్రెయిన్ శీహన్ తెలిపారు. ఈ మేరకు బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్లో మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. ఈ సమావేశాలకు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1800 మంది పాల్గొంటారని తెలిపారు. చివరి రోజున మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో థర్డ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్, సమావేశాల హోస్ట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న స్కీం వర్కర్లు (ఫైల్ ఫొటో)

# ఎదురొడ్డి నిలబడిన స్కీం వర్కర్లు

## పోరాటంతో పరిష్కరించుకుంటున్న సమస్యలు

## మహిళలకు ఆత్మస్థైర్యమిచ్చిన సిఐటియు

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విఒఎలు, ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అన్నం పెడుతున్న మధ్యాహ్నభోజన పథకం కార్మికులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీలు, గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితులకు వివరిస్తూ, డెలివరీ అయ్యే వరకు గర్భిణులను క్రమం తప్పకుండా ఆస్పత్రులకు తీసుకెళ్తున్న ఆశాలు ఏదో ఒకరోజు, ఏదో ఒక సందర్భంలో రాజకీయ వేధింపులు, బెదిరింపులకు గురికాకుండాలేరు. ప్రభుత్వ పథకాలు, వాటి ప్రాధాన్యతలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వానికి గౌరవం తెచ్చిపెడుతున్న ఈ స్కీం వర్కర్లకు ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వడంలేదు. నిత్యమూ రాజకీయ కక్ష సాధింపులు, తొలగింపులు, వేధింపులు, అవమానాలు, తొలగిస్తామన్న బెదిరింపులను భరించుకుంటూ, బాధలను దిగమింగుకుంటూ సేవలందిస్తున్న స్కీం వర్కర్లను ప్రభుత్వం గుర్తించకపోయినా వారి శ్రమను, సేవలను గుర్తించి వారికి సిఐటియు అండగా నిలిచింది. స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలుచేయాలని సిఐటియు నాయకత్వంలో చేస్తున్న పోరాటంతో వీరికి కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి.

అనకాపల్లి జిల్లా సిఐటియు 12వ మహాసభలు ఈ నెల 18, 19న పరవాడలో జరుగుతున్న నేపథ్యంలో స్కీం వర్కర్ల సమస్యలపై సిఐటియు నిర్వహించిన పోరాటాలను ఆత్మావలోకనం చేసుకున్నప్పుడు అది ఎన్నో విజయాలను సొంతం చేసుకుంది. బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్న స్కీం వర్కర్లకు ధైర్యమివ్వగలిగింది. ప్రభుత్వం సకాలంలో గౌరవ వేతనం, జీతాలు చెల్లించకపోయినా, రవాణా, ఇతర బిల్లులు ఇవ్వకపోయినా చేతిలో డబ్బులు పెట్టుకుంటూ వీరంతా సేవలందిస్తున్నారు. ఇటువంటి వారిపట్ల సానుకూలంగావుంటూ సానుభూతితో వారి సమస్యలను అర్థంచేసుకొని ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వాలు నిత్యమూ ఇబ్బందులకు గురిజేస్తూనేవున్నాయి. ఇటువంటి ప్రతి సందర్భంలోనూ సిఐటియు జోక్యం చేసుకొని, వారందరినీ ఐక్యపర్చి న్యాయమైన సమస్యల సాధన కోసం పోరాటాలు చేపట్టింది. మూడేళ్ల కాలపరిమితి పూర్తయిందన్న కారణంతో విఒఎలను, పురుషులను తొలగించాలన్న ప్రభుత్వ సర్క్యులర్ అమలుకాకుండా పోరాటంతో వారు అడ్డుకోగలిగారు. ప్రభుత్వ బడుల్లో పేద పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కింద వండిపెడుతున్న కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రతలేని పరిస్థితుల్లో పనిచేస్తూ పేద పిల్లల మెనూ ఛార్జీలు పెంచాలని చేసిన పోరాటంతో ఫలితమొచ్చింది. మెనూ ఛార్జీలు ప్రభుత్వం పెంచింది. మధ్యాహ్న భోజన పథకం ప్రయివేటు సంస్థల పరంకాకుండా ఎదురొడ్డి కార్మికులు అడ్డుకోగలుగుతున్నారు.

నూతన విద్యా విధానం రద్దు, అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలల్లో విలీనంకాకుండా ఆపాలని, 400 జనాభా దాటిన మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, మెయిన్ వర్కర్సుతో సమానంగా మినీ వర్కర్లకు వేతనం చెల్లించాలని పోరాడింది. అర్హులైన అంగన్‌వాడీలకు సూపర్‌వైజర్ ప్రమోషన్లు ఇవ్వాలన్న పోరాటం విజయంసాధించింది. పనిని బట్టి పారితోషికం ఇచ్చే పద్ధతి నుంచి నెలకు పదివేలు వేతనం ప్రభుత్వం చెల్లించేలా ఆశా వర్కర్లు పోరాడారు. పదివేల వేతనం సాధించుకున్నారు.

**స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. పెన్షన్, గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలి. రిటైర్‌మెంట్ సదుపాయాలు అమలుచేయాలి. ప్రమాద బీమా కల్పించాలి. రాజకీయ వేధింపులు, తొలగింపులు నిలిపివేయాలి.

**- ఆర్.శంకరరావు, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు**

# ఎలాన్ వర్సిటీ బృందం గీతం సందర్శన



గీతం అధ్యక్షుడు శ్రీభరత్‌తో ఎలాన్ వర్సిటీ ప్రతినిధులు

**ప్రజాశక్తి -మధురవాడ :** అమెరికాలోని ప్రముఖ ఎలాన్ విశ్వవిద్యాలయం అధ్యక్షురాలు డాక్టర్ కాన్స్టన్స్ కన్నీ లిడక్స్ బూక్ ఆధ్వర్యంలోప్రతినిధుల బృందంగా గురువారం గీతం వర్సిటీని సందర్శించి అధ్యక్షుడు ఎం.శ్రీభరత్‌తో భేటీఅయ్యారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య మేధోపరమైన సహకారం, సంయుక్త కోర్సుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్దవటం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, ఎలాన్ వర్సిటీ బిజినెస్ స్కూల్‌డీన్ ప్రొఫెసర్ తాడేపల్లి రఘు, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ హయఅజ్జన్, గీతం ఛీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎన్.క్రిష్, గీతం రీసెర్చి కన్సల్టెన్సీ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా పప్పు పాల్గొన్నార.. ఎలాన్ విశ్వవిద్యాలయం ఎదిగిన తీరును, నూతన విద్యావిధానాలు, భవిష్య ప్రణాళికలను అధ్యక్షురాలు డాక్టర్ కాన్స్టన్స్ కన్నీ లిడక్స్ బూక్ వివరించారు.

# ముఠా కార్మికులపై దుష్ప్రచారం సిగ్గుచేటు

**ప్రజాశక్తి- సీతమ్మధార:** ముఠా కార్మికుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా దుష్ప్రచారం చేస్తున్న న్యూ ఆంధ్ర మోటార్స్, ట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం అక్కయ్యపాలెం కార్మికశాఖ కార్యాలయం వద్ద ముఠా కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని ముఠా కార్మికులు నిత్యం పోరాటాలు సాగిస్తూనే ఉన్నారని, అంతేకాక కడప మార్బుల్‌స వంటి బరువైన వస్తువుల అన్‌లోడింగ్‌లో కార్మికుల కష్టానికి అనుగుణంగా వేరే రేట్లు నిర్ణయించబడతాయన్నారు. దీనిపై అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వై రాజు, టీ పైడిరాజు, తాతారావు పాల్గొన్నారు.

## శారదాపీఠాన్ని సందర్శించిన

# దేవాదాయశాఖ మంత్రి, కమిషనర్



మంత్రిని అభినందిస్తున్న శారదా పీఠాధిపతి

**ప్రజాశక్తి పెందుర్తి :** విశాఖ శారదా పీఠాన్ని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరి జవహర్‌లాల్ గురువారం సందర్శించారు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతితో స్వామి ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, అర్చకుల వేతనాలు, వంశపారంపర్య హక్కులు తదితర ఇబ్బందులను తొలగించాలని, రాయలసీమలోని కదిరి, కసాపురం తదితర క్షేత్రాల్లో భక్తులకు వసతి సమస్య పరిష్కరించాలని స్వామీజీ సూచించగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఆలయ భూముల పరిరక్షణలో రాజీ పడబోమని మంత్రి సత్యనారాయణ స్పష్టం చేశారు.

# అంగన్వాడీ చిన్నారికి చురకలుపై ఆగ్రహం

**ప్రజాశక్తి- సీతమ్మధార:** నగరంలోని సీతంపేట కనకమ్మవారివీధి అంగన్వాడీ కేంద్రంలోని అల్లరి చేస్తోందన్న కారణంతో మూడున్నరేళ్ల చిన్నారికి అక్కడి ఆయా అగ్గిపుల్లతో చురకలు పెట్టడంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, సిడిపిఒలు శ్రీలత, రమణకుమారిలో సంభందిత అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. బాలిక ముఖంపై ఉన్న చురకలను పరిశీలించి, తక్షణ వైద్యసేవలకు ఆదేశించారు. ఘటనపై 24గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో కమిషన్ కార్యాలయానికి నివేదిక పంపాలని కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ, ఇతర అధికారులను ఆదేశించారు. పర్యవేక్షక అధికారి ఉమాజానకి, వార్డుల మహిళా సంక్షేమ కార్యదర్శులు కె.విజయ, ఎ.లక్ష్మి, కె.కరిష్మా, ఆర్.సాయిహర్షిత, పి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



బాలిక ముఖంపై చురకలు పరిశీలిస్తున్న సీతారాం

# స్టీల్‌ప్లాంట్ భద్రత విషయంలో రాజీ లేదు



కార్మిక నేతలతో సిఐఎస్ఎఫ్ కమాండెంట్

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్‌తో ఉక్కు కార్మిక సంఘ నేతలు భేటీఅయి పలు కీలక విషయాలపై చర్చించారు. ప్లాంట్ భద్రత, గేట్ల వద్ద ఉద్యోగులు సులభంగా ప్రవేశ, నిష్క్రమణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్లాంట్‌లో విభాగాల వద్ద సిబ్బంది నియామకం వంటి విషయాలపై చర్చించారు. ఉద్యోగులకు ఇబ్బంది కలిగే చర్యలు తీసుకోవద్దని కోరారు.దీనిపై అత్తార్ మహ్మద్ స్పందిస్తూ, ప్లాంట్ భద్రత విషయంలో రాజీ లేదని, కలర్‌జెరాక్స్ గుర్తింపు కార్డులతో ప్లాంట్‌లోకి ఎవరిని అనుమతించబోమని స్పష్టం చేశారు. కమాండెంట్‌ను కలిసిన వారిలో కార్మిక నేతలు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కెఎస్‌ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.మస్తానప్ప, డివీరమణ, బి.అప్పారావు, దొమ్మేటి అప్పారావు, కొమ్మినేని శ్రీనివాసరావు, వెంకటరాజు, టి.సత్యనారాయణ, రామకష్ణ, ఈశ్వరరావు, జీవీ.సుబ్బయ్య, గంగవరం గోపి, పెంటారావు ఉన్నారు.

# 'హయగ్రీవ' కబ్జాదారులకు నోటీసులు అభినందనీయం

**ప్రజాశక్తి- సీతమ్మధార :** రూ.500 కోట్ల విలువైన హాయగ్రీవ స్థలాలకు సంబంధించి కబ్జాదారులకు జిల్లా కలెక్టర్ మల్లికార్జున నోటీసులు ఇవ్వడం అభినందనీయమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. గురువారం పౌరగ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో కబ్జాదారులకు ఇచ్చిన నోటీసులను చూపించి, కలెక్టర్ చర్యలను అభినందించారు. ఎండాడ గ్రామంలోని సర్వే నంబర్ 92/3లో 12.51 ఎకరాల హాయగ్రీవ భూముల కుంభకోణంపై ఏడాదిగా జనసేన ఆందోళన చేస్తోందన్నారు. హాయగ్రీవ భూముల అనుమతులను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ నోటీసులు ఇస్తే జీవీఎంసీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

కమిషనర్‌గా రాగానే హయగ్రీవ భూములపై చర్యలు తీసుకుంటామని చెప్పిన రాజాబాబు, ఇంతవరకు సంబంధిత పనులను ఎందుకు నిలిపేయలేదని ప్రశ్నించారు. అక్రమాలకు కొమ్ముకాస్తే, గతంలో 14మంది ఐఎఎస్‌లకు పట్టినగతి తప్పదని హెచ్చరించారు. ఎంవివి, జీవిలపై క్రిమినల్ కేసులు పెట్టి, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరారు. సమావేశంలో జనసేన నాయకులు శ్రీనివాస్ పట్నాయక్, ఆర్ కష్ణ, రీజనల్ కోఆర్డినేటర్లు నాగలక్ష్మి శాలినీదేవి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## 18,19 తేదీల్లో పంచకర్మ వైద్యశిబిరం

**ప్రజాశక్తి -కంచరపాలెం :** దీర్ఘకాల రోగాలతో బాధపడే వారికి పంచకర్మ ఆయుర్వేద విధానం ద్వారా చికిత్స అందించేందుకు ఈ నెల 18, 19 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపంలోని తమ కేంద్రంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ కెయం.ఉన్నికృష్ణన్ నాయర్ రెండు రోజుల పాటు శిబిరంలో అందుబాటులో ఉండి, ఆర్థరైటిస్, నడుం నొప్పి, స్పాండిలైటిస్, చర్మ సంబంధ వ్యాధులు, మెదడుకు సంబంధించిన నాడీ సమస్యలు, లింగ సంపర్క సమస్యలతో బాధపడే వారికి వైద్యం అందిస్తారన్నారు. అపాయింట్‌మెంట్ కొరకు 90305 68264 మొబైల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## బడుగులకు రాయితీ రుణాలివ్వాలి

**ప్రజాశక్తి -కంచరపాలెం :** ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ అమలుతో పాటు వారికి సబ్సిడీ రుణాలు అందజేయాలని ఎపి బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ డాక్టర్ సనపల లక్ష్మీనర్సింహా అన్నారు. గురువారం 51వ వార్డు అంబేద్కర్‌నగర్, వుడా కాలనీ, మాధవధార తదితర ప్రాంతాల్లో జనజాగృతి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద పైడితల్లమ్మను దర్శించుకున్నారు. అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనజాగృతియాత్రలో సమీకరించిన సమస్యల పరిష్కారానికి సిఎం జగన్‌ను కలిసి నివేదిస్తానని వెల్లడించారు.



గోవిందమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విమల, తదితరులు

# ఐద్వా నేత గోవిందమ్మకు ఘననివాళి

**ప్రజాశక్తి -ములగాడ :** ఐద్వా నేత టి. గోవిందమ్మ నాలుగో వర్ధంతిని 62వ వార్డు త్రినాథపురంలో గురువారం నిర్వహించారు. గోవిందమ్మ చిత్రపటానికి ఐద్వా రాష్ట్ర నేత ఆర్ విమల, మల్కాపురం జోన్ నాయకులు కె.అన్నపూర్ణ, వరలక్ష్మి, బి రాజేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, ఐద్వా రాష్ట్ర నేత ఆర్.విమల తదితరులు మాట్లాడుతూ గోవిందమ్మ సేవలను కొనియాడారు. ఆమె మరణం పార్టీకి ఐద్వా సంఘానికి తీరనిలోటన్నారు.

సిపిఎం జోన్ నేత, గోవిందమ్మ భర్త టి.అప్పారావు మాట్లాడుతూ గోవిందమ్మ ప్రోత్సాహంతోనే తానీ స్థాయికి చేరానన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ నేత పిసిని రామారావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.పెంటారావు ఆర్ లక్ష్మణ మూర్తి, డివైఎఫ్ఐ జోన్ కార్యదర్శి ఎస్.వాసు ఐద్వా ఏరియా నాయకులు కె. అన్నపూర్ణ బి .రాజేశ్వరి ,పి.వరలక్ష్మి, శ్యామల, బి.రామలక్ష్మి, అరుణ, రాణి ధనలక్ష్మి పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్



వినతులు స్వీకరిస్తున్న కెకె.రాజు

**ప్రజాశక్తి- సీతమ్మధార :** ఉత్తర నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు గురువారం గ్రీవెన్స్ నిర్వహించారు. హౌసింగ్, పెన్షన్లు, ఇతర వ్యక్తిగత సమస్యలతోపాటు సామాజిక సమస్యలపై అర్జీలను స్వీకరించి, కొన్నింటిని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని అర్జీదారులకు భరోసానిచ్చారు.కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె. అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నీలి రవి, షేక్ జుబైర్ పాల్గొన్నారు.

## బాక్సింగ్‌లో లిఖితకు బంగారు పతకం

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** జిల్లాస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌పోటీల్లో 53కిలోల విభాగంలో అగనంపూడి ఉన్నతపాఠశాల 9వ తరగతి విద్యార్థిని సాయి లిఖిత బంగారు పతకాన్ని గెలుచుకుంది.ఉక్కునగరంలో శ్రీనివాసరావు అనే కోచ్ వద్ద శిక్షణ పొందిన లిఖిత, ఈ నెల 13న జరిగిన సబ్ జూనియర్ కేటగిరీలో 50, 53 కిలోల కేటగిరీలలో జిల్లా స్థాయి పోటీల్లో పతకాన్ని సాధించినట్లు తెలిపారు. లిఖితను హైస్కూల్ హెచ్ఎం కృష్ణారావు, ప్రసాద్, కృష్ణవేణి అభినందించారు.